సాక్షి
ఖమ్మం

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



అప్రమత్తతే ఆయుధం
అగ్నిప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేటి నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



దేశంలో మోదీ ప్రభంజనం
దేశంలో మోదీ ప్రభంజనం బలంగా వీస్తోందని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత కాస్త తక్కువగా నమోదవుతుంది. మధ్యాహ్నం మాత్రం వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీవారు, అమ్మవార్లకు కల్యాణ అలంకరణ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఐదో రోజైన శనివారం కొనసాగాయి. ఈసందర్భంగా అర్చకులు శ్రీవారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు చేశాక స్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించడంతో భక్తులు దర్శించుకున్నారు. అలాగే, స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణం, పల్లకీ సేవ నిర్వహించడంతో గజ వాహనంపై గిరిప్రదక్షిణ చేయించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించండి

ఖమ్మం సహకారనగర్: సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)–2 పరీక్షలు ఈనెల 15న మొదలుకానుండగా, తెలుగు, హిందీ పరీక్షలు కొత్త ప్రశ్నాపత్రాలతోనే నిర్వహించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. కొణిజర్ల మండలంలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో ముందుగానే తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. దీంతో ఈ రెండు సబ్జెక్టులకు కొత్తగా ప్రశ్నాపత్రాలు ముద్రించినందున అన్ని పాఠశాలల్లో వీటితోనే నిర్వహించాలని డీఈఓ సూచించారు. కాగా, ముందుగా పరీక్షలు నిర్వహించిన మేరీ ఇమ్మాక్యులేట్ యాజమాన్యానికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

విజయవాడ–కొత్తగూడెం ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ

కారేపల్లి: విజయవాడ–భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం), భద్రాచలం రోడ్డు–విజయవాడ మధ్య ప్యాసింజర్ రైలును దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం పునఃప్రారంభించారు. ఈ రైళ్లను 21వ తేదీ వరకు నడిపిస్తామని ప్రకటించారు. విజయవాడలో మొదలుకానున్న ప్యాసింజర్ రైలు ఖమ్మం, డోర్నకల్, కారేపల్లి మీదుగా కొత్తగూడెం(భద్రాచలం రోడ్డు) వరకు నడుస్తుంది. తిరిగి కొత్తగూడెంలో మొదలై ఇదే మార్గం ద్వారా విజయవాడ చేరుకుంటుంది. ప్యాసింజర్ రైలును ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండడంతో పలువురు హర్షం చేస్తున్నారు. ఇదే మాదిరి కరోనా సమయాన నిలిపేసిన అన్నిరైళ్లను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎన్నికల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సమీక్ష



చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

సత్తుపల్లి: లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ డి.మధుసూదన్‌నాయక్ సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలకు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ఫిర్యాదు చేసేందుకు సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు, గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువగా పోలింగ్ అయిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆతర్వాత ఆయన గంగారంలోని సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. తహసీల్దార్లు యోగీశ్వరరావు, ఎంఏ.రాజు, జి.ప్రతాప్, డి.సాంబశివుడు, వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ




మంత్రితో జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు మాలోత్ ప్రియాంక శనివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ తరఫున ప్రియాంక గెలవగా.. మండలంలోని సుకినీ తండాలో ఆమెకు మంత్రి తుమ్మల, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎం.డీ.జావీద్, కార్పొరేటర్లు మలీదు జగన్, వెంకటేశ్వర్లు, ఎంపీపీ గౌరితో పాటు లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, తారాచంద్, బోయిన లక్ష్మణ్‌గౌడ్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం లోక్‌సభ స్థానంపై బీఆర్‌ఎస్ నజర్

- ఉమ్మడి జిల్లా నేతలకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- ముందుగానే పార్టీ అభ్యర్థిగా నామా పేరు ప్రకటన
- నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న అభ్యర్థి.. సన్నాహక భేటీల్లో నేతలు



సిట్టింగ్ చేజారకుండా..

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: సిట్టింగ్ స్థానమైన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు కోసం బీఆర్‌ఎస్ సర్వశక్తులొడ్డుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయాన్ని మర్చిపోయి.. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తమయ్యేలా కేడర్‌కు నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావును ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్.. ఆయన గెలుపు బాధ్యతలను జిల్లా నాయకత్వానికి అప్పగించారు. దీంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీసారి నిరాశే

తెలంగాణ ఏర్పడ్డాక మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు నిరాశే ఎదురవుతోంది. 2014 ఎన్నికల్లో పది స్థానాలకు గాను కొత్తగూడెంలో జలగం వెంకట్రావు మాత్రమే గెలిచారు. 2018లో ఖమ్మం నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గెలవగా.. ఇటీవల ఎన్నికల్లో భద్రాచలంలో తెల్లం వెంకట్రావు గెలిచినా ఆయన సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటిన బీఆర్‌ఎస్, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రభావం చూపలేకపోయింది. అయితే 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలో ఫలితాలు నిరాశపరిచినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీపరంగా నష్టం జరగలేదు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా

అసెంబ్లీ ఎన్నికల్లో కుదేలైన బీఆర్‌ఎస్.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఓట్లు కొల్లగొట్టింది. 2014లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరగడంతో రెండింటిలోనూ బీఆర్‌ఎస్ అపజయం మూటగట్టుకుంది. ఇక 2018లో అసెంబ్లీ ఎన్నికలు జరగగా, ఉమ్మడి జిల్లాలో ఒకే సీటుకు పరిమితమైంది. ఆ తర్వాత 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు.. కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరిపై విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ బలం పుంజుకుంది. ఈసారి కూడా వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆ పార్టీ నేతలు నమ్మకంగా ఉన్నారు.

ప్రస్తుతం భిన్న పరిస్థితులు..

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో పరాజయం పాలైనా.. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగాయి. ఇతర పార్టీల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి క్యూ కట్టారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేకుండా పోయింది.

ఏకతాటిపైకి..

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం ఆ పార్టీ నేతలు ఏకమయ్యారు. కొద్దిరోజుల క్రితం ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమై, నామా గెలుపు బాధ్యతను అప్పగించారు. అప్పటి నుంచి పార్టీ నాయకులు లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌తో మమేకమవుతున్నారు. అభ్యర్థి నామాతో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విస్తృతంగా పర్యటిస్తూ కేడర్‌లో స్థైర్యాన్ని నింపేలా సన్నాహక భేటీలను ఉపయోగించుకుంటున్నారు. ఇక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టడంతో త్వరలోనే ఉమ్మడి ఖమ్మంలోనూ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఏ క్షణంలో ఎవరు బీఆర్‌ఎస్‌ను వీడతారో తెలియకుండా ఉంది. ఉమ్మడి జిల్లాలో భద్రాచలం నుంచి మాత్రమే బీఆర్‌ఎస్‌కు విజయం దక్కగా.. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంతో ఇప్పుడు ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోయారు. ఈ పరిస్థితుల నేపథ్యాన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయం సాధించడాన్ని బీఆర్‌ఎస్ తప్పనిసరిగా భావిస్తోంది.

పాలేరు నా సొంతిల్లు..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఇకపై వారానికోరోజు ప్రజలకు అందుబాటులో ఉంటా
- సమస్య ఏదైనా నేరుగా ఫోన్ చేయొచ్చు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: 'పాలేరు నా సొంతిల్లు... ఇక్కడి పార్టీ శ్రేణులు, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాపై ఉంది. ఎంత పని ఒత్తిడి ఉన్నా ఇక నుంచి వారానికోరోజు ప్రజలకు అందుబాటులో ఉంటాను. మిగిలిన సమయాల్లోనూ సమస్య నాకు తెలిసేలా రెండు మండలాలకు ఒకరి చొప్పున సిబ్బందిని నియమిస్తా. అలాగే, ప్రజలు సమస్యలపై నేరుగా ఫోన్ చేసేలా కొత్త నంబర్ ప్రకటిస్తా..' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో శనివారం సమావేశమయ్యారు. తొలుత మండలాల వారీగా నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం మంత్రి మాట్లాడారు. పాలేరు ప్రజల ఆశీస్సులతో గెలిచిన తాను మంత్రి అయ్యానని చెప్పారు. ఇప్పటికే పలు సమస్యలు పరిష్కరించినా, ఇంకా మిగిలినవి కూడా పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇక నుంచి పాలేరుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తానని, రెండు మండలాలకు ఒకరు చొప్పున 24గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, తాగునీరు.. సమస్య ఏదైనా వెంటనే పరిష్కారమయ్యేలా వారు కృషి చేస్తారని చెప్పారు. ఇక వారానికోరోజు పాలేరులో పర్యటించి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, మిగతా సమస్యలు తనను నేరుగా సంప్రదించేలా కొత్త ఫోన్ నంబర్ అందుబాటులోకి తీసుకొస్తానని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

మంత్రి వాహనం తనిఖీ



తిరుమలాయపాలెం: హైదరాబాద్ నుంచి తిరుమలాయపాలెం మండలంలోని హైదర్‌సాయిపేట పర్యటనకు వస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి వాహనాన్ని శనివారం ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు క్రాస్ వద్ద ఎస్‌ఎస్‌టీ(సర్వైలెన్స్ స్టాటిస్టికల్ టీం) అధికారులు, పోలీసులు.. మంత్రి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలకు మంత్రి సహకరించారు.

మహా పుష్పాభిషేకం



స్వామికి మహాపుష్పాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మం 4వ డివిజన్ బాలాజీనగర్‌లోని స్వయంభూ శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి 20 వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వసంతోత్సవం, చక్రస్నానం, మహాపుష్పాభిషేకంతో పాటు మహాపూర్ణహుతి వేడుకలను వేలాది మంది భక్తుల సమక్షాన ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరగిరినాధుని రామాచార్యులు బృందం ఆధ్వర్యాన పూజలు చేయగా.. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, మేయర్ నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పల్లె బోయిన చంద్రం, మిక్కిలినేని నరేంద్ర, హన్మంతరావు, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లి కొమరయ్య, పురం తిరుపతయ్య తదితరుల ఆధ్వర్యాన ఏర్పాట్లను పర్యవేక్షించారు. – ఖమ్మంఅర్బన్

మున్నేరులో ఎల్లవేళలా నీరు

- కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: మున్నేరు నదిలో ఎల్లవేళలా నీరు నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఖమ్మం నగరానికి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయం శనివారం ఆయన మున్నేరు రక్షణ గోడ నిర్మాణ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమావేశమై భూసేకరణ, డిజైన్ తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రక్షణ గోడ నిర్మాణం అటు పాలేరు, ఇటు ఖమ్మం నియోజకవర్గాల్లో జరగనున్నందున.. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా నిర్మించాలన్నారు. వీలైతే బోటింగ్ కూడా ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో వాల్ ఎత్తును పెంచడానికి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. అంతేకాక వర్షాకాలంలో ఎంత వరద వచ్చినా నగరంలోకి బ్యాక్ వాటర్ చేరకుండా పటిష్టమైన డ్రెయినీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, నదిలో చెత్త వేయకుండా రెయిలింగ్ బిగించి, వైకుంఠధామం దగ్గర స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టుకు భూసేకరణ విషయంలో సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, తద్వారా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా రామయ్య పెళ్లి పనులు

- శరవేగంగా లడ్డూలు, ముత్యాల తలంబ్రాల తయారీ
- నేడు గరుడ ధ్వజపటలేఖనం, గరుడధ్వజాధివాసం
- కలెక్టరేట్‌లో వీవీఐపీ, వీఐపీ టికెట్ల విక్రయం



సార్వభౌమసేవలో స్వామి వారు



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యాన శ్రీరామనవమి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో శ్రీ సీతారాముల కల్యాణం, మరుసటి రోజు పట్టాభిషేక మహోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే భద్రాచలంలో మూడు దిక్కుల, సారపాక, మోరంపల్లి బంజర్‌తో పాటు పలు గ్రామాల్లో భక్తులకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. కల్యాణం జరగనున్న మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం, దేవస్థానాన్ని పంచరంగులతో తీర్చిదిద్దారు. వీవీఐపీ, వీఐపీ, ఉభయదాతలు, ఇతర సెక్టార్లలో చలువ పందిళ్ల నిర్మాణం పూర్తికాగా, చాందినీ వస్త్రాలతో అలంకరిస్తున్నారు. దేవస్థానంతోపాటు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ దీపాలతో అలంకరణ చేపట్టారు. ఏర్పాట్లపై కలెక్టర్ ప్రియాంక ప్రత్యేక దృష్టి సారించడంతో వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.

2.5 లక్షల లడ్డూలు

శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో లడ్డూల తయారీ ప్రారంభమైంది. తానీషా కల్యాణ మండపంలోని పైభాగంలో లడ్డూల తయారీ చేపట్టారు. గతేడాది రెండు లక్షల లడ్డూలను తయారు చేయగా, ఈ ఏడాది భక్తుల రాక పెరిగే అవకాశముందని భావిస్తున్న నేపథ్యంలో రెండున్నర లక్షల లడ్డూలను తయారీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు తగినట్లుగానే పంపిణీకి సైతం కౌంటర్లను పెంచనున్నారు.

నేడు గరుడ ధ్వజపటలేఖనం, గరుడధ్వజాధివాసం

వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి సార్వభౌమ వాహన సేవ జరిగింది. యాగశాలలో మండల, కుండ, కలశ తదితర క్రతువులు నిర్వహించారు. ఇక ఆదివారం గరుడ ధ్వజపట లేఖనం, గరుడధ్వజాపటావిష్కరణ, గరుడధ్వజాధివాసం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు, పండితులు నిర్వహించనున్నారు.

వీవీఐపీ, వీఐపీ టికెట్ల అమ్మకం కలెక్టరేట్‌లో..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ఏడాది సీఎంతో పాటు ఇతర మంత్రులు నవమికి వచ్చే అవకాశం లేకపోవడంతో, సీఎం సెక్టార్‌ను వీవీఐపీ, వాటి వెనుక వీఐపీ సెక్టార్లుగా విభజించారు. ఇందులో వీవీఐపీలో సెక్టార్‌లో ఒక్కొక్కరు రూ.10 వేల టికెట్‌తో 100 మంది, వీఐపీ సెక్టార్‌లో ఒక్కొక్కరు రూ. 5 వేల టికెట్‌తో 250 మంది వీక్షించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచకపోవడంతో, పలువురు సీఆర్‌ఓ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. చివరకు కలెక్టరేట్‌లో వీటిని విక్రయించనున్నట్లు అధికారులు తాజాగా ప్రకటించారు.

3.5 లక్షల తలంబ్రాల ప్యాకెట్లు

సీఆర్‌ఓ వెనుక భాగంలో ఉన్న టీటీడీ సత్రంలో ముత్యాల తలంబ్రాల తయారీ ప్రారంభించారు. గతేడాది రెండున్నర లక్షల ప్యాకెట్లు సిద్ధం చేయగా, డిమాండ్‌ను బట్టి ఈసారి మూడు నుంచి మూడున్నర లక్షల ప్యాకెట్లను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. భక్తులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలిపిన తలంబ్రాలను మిషనరీ సహాయంతో ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. గతేడాది తిరుపతికి చెందిన ఓ దాత రూ.1.40 లక్షల వ్యయంతో అందజేసిన మిషన్‌తో గంటకు 1,500 ప్యాకెట్ల చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. దీంతో రోజుకు 25 వేల వరకు తలంబ్రాల ప్యాకెట్లు భక్తుల కోసం అందుబాటులోకి వస్తున్నాయి. గతేడాది లాగే రెండు ముత్యాలతో ఉన్న తలంబ్రాల ప్యాకెట్ రూ.30కే భక్తులకు, పోస్టల్ శాఖకు విక్రయించనున్నారు. ఇక ఆర్టీసీ మాత్రం గతేడాదికి మించి రూ.151 వసూలు చేస్తుండగా, దేవస్థానం ఒక్కో ప్యాకెట్‌ను ఆర్టీసీకి రూ.50కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఏసీపీ

ఖమ్మంక్రైం: మండే ఎండల్లో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసేందుకు వీఎస్ఆర్ డెయిరీ బాధ్యులు ముందుకొచ్చారు. ఈసందర్భంగా శనివారం సిబ్బందికి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మజ్జిగ పంపిణీ చేశారు. రోజుకు 100 ప్యాకెట్ల చొప్పున నెల రోజుల పాటు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెయిరీ బాధ్యులు లింగరాజు, కమలాకర్, నరసింహారావు, కార్యక్రమంలో ఎస్సైలు మోహన్ బాబు, రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు

వైరా: అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈనెల 15నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించాలని అధికారులు ఆదేశించగా.. ఓ ప్రైవేట్ పాఠశాల బాధ్యులు ముందుగానే నిర్వహించింది. వైరా శాంతినగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఈనెల 8నుంచే పరీక్షలు నిర్వహిస్తుండడంతో కొణిజర్ల ఎంఈఓ మోదుగు శ్యాంసన్ శనివారం విచారణ చేశారు. ఇప్పటికే తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించినట్లు తేలగా ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా యజమాన్యానికి డీఈఓ సోమశేఖరశర్మ నోటీసులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'సింగరేణి' ఆర్వో ప్లాంట్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం, జేవీఆర్ ఓసీకి పది కిలోమీటర్ల దూరాన ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటుచేయనుంది. ఈ విషయమై సంస్థ తరఫున వారం రోజులుగా సర్వే చేస్తున్నారు. రెండు ఓసీల పరిధిలో సుమారు 50 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేయనుండగా, ఒక్కో ప్లాంట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు వెచ్చించనున్నట్లు తెలిసింది.

ఖమ్మం సీటు పొంగులేటి కుటుంబీకులకే ఇవ్వాలి

ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికే ఖమ్మం లోక్‌సభ టికెట్ కేటాయించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ పిడమర్తి రవి, మాజీ పీసీసీ కార్యదర్శి, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక చైర్మన్ వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కోరారు. మంత్రి సోదరుడు ప్రసాదరెడ్డి లేదా అదే కుటుంబానికి చెందిన రఘుమారెడ్డికి టికెట్ ఇవ్వాలని వారు ఓ ప్రకటనలో అధిష్టానానికి విన్నవించారు.

19న జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలోఈనెల 19న జాతీయ టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా వారు ఫెస్ట్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించగా వైస్ చైర్మన్ సత్యప్రసాద్ వివరాలు వెల్లడించారు.

మినప పంటకు నిప్పు

కారేపల్లి: మినప పంటకు నిప్పు పెట్టిన వ్యక్తిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని సూర్యతండాకు చెందిన చాందావత్ లక్ష్మణ్ తన కుమారుడు రవికి చెందిన రెండెకరాల్లో జొన్న, పెసర, మినప పంటలు సాగు చేశాడు. అయితే జొన్న, పెసర ఇప్పటికే కోయగా, మినప పంట అలాగే ఉంది. అదే గ్రామానికి చెందిన విజయ్ గతంలో వీఆర్ఓగా పనిచేయగా... రవి భూమిని ఆయన పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నాడు. ఈమేరకు శుక్రవారం మినపపంటకు విజయ్ బావ నిప్పు పెట్టగా పంట కాలిపోయిందని లక్ష్మణ్ శనివా రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడిపై 'గ్యాంగ్' దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని బస్‌డిపో రోడ్డులో శనివారం రాత్రి సుమారు 25మందికి పైగా యువకులు ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. అడ్డొచ్చిన ఆ యువకుడి తండ్రిపైనా దాడి చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ప్రాంతానికి చెందిన నబీ ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈమేరకు శనివారం రాత్రి ఆయన ఇంటి ఎదుట ముందస్తు ప్రణాళికతో ఇద్దరు గొడవ పడుతున్నట్లు నటిస్తుండగా, నబీ బయటకు వచ్చి వివరాలు అడుగుతున్నాడు. దీంతో అక్కడే పొంచి ఉన్న నబీ భార్య బంధువులుగా భావిస్తున్న 25మందికి పైగా ఒక్కసారి దాడికి యత్నించారు. దీంతో నబీ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకోగా.. బయట ఉన్న ఆయన తండ్రి అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయన దాడి చేశారు. ఈఘటనతో ఆందోళనకు గురైన స్థానికులు ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు వచ్చేసరికి వారు పారిపోయారు.

అప్రమత్తతే ఆయుధం

- జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాలు దూరం
- వేసవిలో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ

నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు

మిగతా సమయంతో పోలిస్తే అగ్నిప్రమాదాలు వేసవికాలంలో ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యాన ప్రజలు ఇళ్లల్లో ఉపయోగించే గ్యాస్ సిలిండర్ మొదలు విద్యుత్ వినియోగం వరకు ప్రతీ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి. లేనిపక్షంలో అగ్ని ప్రమాదం జరిగితే వడగాలులకు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించి భారీనష్టం జరిగే అవకాశముంది. ఊరేగింపులు, వివిధ కార్యక్రమాల సందర్భంగా కాల్చే టపాసులు గడ్డి వాములు, ఇళ్లపై పడి అగ్ని ప్రమాదాలు, ప్రాణహానీ జరుగుతుంది. ఈమేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అగ్ని ప్రమాదాలను సాధ్యమైనంత వరకు నివారించే అవకాశముంటుంది. ఇందుకోసం అగ్నిమాపక శాఖ ఈనెల 14వ తేదీ ఆదివారం నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించి ప్రమాదాల బారిన పడకుండానే కాక ప్రమాదాలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన తీరుపై ప్రజలను అప్రమత్తం చేయనుంది. – సత్తుపల్లిటౌన్

● మాక్‌డ్రిల్‌తో అవగాహన

ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. ఎండల ప్రభావం కారణంగా ఇళ్లు, గడ్డివాములు, అడవులు, దుకాణ సముదాయాలు, మిల్లుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో ఆస్తినష్టమే కాక ప్రాణనష్టం జరిగే ప్రమాదముంది. ఏటా ఎక్కడో ఓచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండగా సర్వస్వం కోల్పోయిన కుటుంబాలు వీధిన పడతాయి. అయితే, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవడమే కాక... అగ్నిమాపక శాఖకు సమాచారం ఇస్తే ప్రమాద తీవ్ర అవకాశముంటుంది. ఈనేపథ్యాన నేడు ప్రారంభమయ్యే వారోత్సవాల్లో భాగంగా భారీ అగ్నిప్రమాదాల తీవ్రతను తగ్గించి ఆస్తులు, ప్రాణాలను కాపాడేందుకు మాక్‌డ్రిల్‌తో అగ్నిమాపక శాఖ అప్రమత్తం చేయనుంది. ఇదేసమయాన అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయనున్నారు.

● అందుబాటులో 'బుల్లెట్'

నానాటికీ పెరుగుతున్న నిర్మాణాలకు తోడు పలువురు నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆయా గల్లీల్లోకి ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ఎక్కడైనా వెళ్లగలిగేలా బుల్లెట్ ఫైర్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో రెండు సిలిండర్లలో 20 లీటర్ల నీరు ఉంటుంది. ఫోమ్ వాటర్(నురగ) తుంపర్లుగా నీరు పిచికారి చేస్తూ వంద మీటర్ల వెడల్పులో వ్యాపించిన మంటలను సైతం సులువుగా ఆర్పేలా సిబ్బంది వీటిని ఉపయోగిస్తున్నారు.

● ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

– వంటగదిలో డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచొద్దు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయాన ఇళ్లలో విద్యుత్‌లైట్లు, మెయిన్ వద్ద సరఫరాను పూర్తిగా నిలిపివేయాలి. ఇంటికి అన్నివైపులా గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. దేవుడి మందిరం వద్ద వెలిగించిన దీపాలను అలాగే వదిలేసి బయటకు వెళ్లొద్దు. వంటపని పూర్తికాగానే గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వొద్దు. ఐఎస్ఐ మార్కు ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులను మాత్రమే వినియోగించాలి. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగితే ఆర్పడానికి ఎల్లప్పుడు నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలి.

● మంటల్లో చిక్కితే....

ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి మంటల్లో చిక్కితే కంగారుపడకుండా దగ్గరలో ఉన్న అత్యవసర ద్వారాలను గుర్తించాలి. మంటలను ఆర్పే ఉపకరణాలు కన్పిస్తే వాటి సాయంతో బయటపడేందుకు ప్రయత్నించాలి. పొగ ముసురుకుంటే ముఖానికి తడి వస్త్రం అడ్డు పెట్టుకుని బయటకు రావాలి. నూనె ఉత్పత్తులు ఉన్న వైపు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దు. దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా నేలపై దొర్లడం లేదా దుప్పటి చుట్టుకుంటే ఫలితం ఉంటుంది.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

అగ్నిమాపక కేంద్రం	ఫోన్ నంబర్
ఖమ్మం	87126 99280
సత్తుపల్లి	87126 99282
ఇల్లెందు	87126 99294
కొత్తగూడెం	87126 99296
భద్రాచలం	87126 99292
మధిర	87126 99284
అశ్వారావుపేట	87126 99298
వైరా	87126 99288
కూసుమంచి	87126 99286
మణుగూరు	87126 99300
నేలకొండపల్లి	87126 99290

అవగాహన అవసరం..



వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అగ్ని ప్రమాదాల జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. నిర్లక్ష్యంగా ఉంటే తీవ్రత పెరుగుతుంది. వంట సమయాన మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం చేయొద్దు. ఇంటి పరిసరాల్లో చెత్త, వృథా వస్తువులు పేరుకుపోకుండా చూడాలి. అగ్నిప్రమాదం జరిగితే నివారణ మార్గాలపై అవగాహన పెంచుకోవాలి.

– ఐ.చంద్రశేఖర్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్, సత్తుపల్లి



గల్లీల్లోకి సులువుగా వెళ్లే ఫైర్ బుల్లెట్



మాట్లాడుతున్న అభయ్‌పాటిల్, పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు

దేశంలో మోదీ ప్రభంజనం

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో మోదీ ప్రభంజనం బలంగా వీస్తోందని.. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన పార్లమెంటరీ బూత్ కమిటీ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఖమ్మంలోనూ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయం ఖాయమైందని చెప్పడానికే తాను ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలవనుండగా.. ఆ జాబితాలో ఖమ్మం సైతం ఉంటుందని తెలిపారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈసారి బీజేపీ అత్యధిక సీట్లు గెలవనుండగా.. ఖమ్మంలో సైతం విజయం ఖాయమని చెప్పారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త మోదీ సైనికుడిగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం అభ్యర్థి వినోద్ రావు మాట్లాడగా.. అనంతరం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యానారాయణతో పాటు నంబూరి రామలింగేశ్వరావు, శ్యాంరాథోడ్, కిరణ్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బెదిరింపులకు భయపడేది లేదు..

- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ముదిగొండ : మాట్లాడుతున్న ఎంపీ నామా, పక్కన ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు తదితరులు

ముదిగొండ/వేంసూరు: బీజేపీ నాయకుల బెదిరింపులకు తాము భయపడేది లేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాటలో ముందుకు సాగుతామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ముదిగొండ, వేంసూరు మండలం మర్లపాడులో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన ఖమ్మం బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. బలమైన నాయకుడు నామా పార్లమెంట్‌లో ఉంటే నిధులు సాధించడంతో పాటు సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈమేరకు పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలు, ప్రజల వాణిని బలంగా వినిపించగలిగే బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును మరోమారు గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో ఏ ఒక్క రైతు సాగునీటికి ఇబ్బంది పడకపోగా.. ఇప్పుడు కాంగ్రెస్ తీరుతో పంటలు కోల్పోయారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం-సూర్యాపేట, కోదాడ-కురవి జాతీయ రహదారులపై రైతుల సౌకర్యార్థం అండర్ పాస్‌లతో పాటు సర్వీసు రోడ్లు మంజూరు చేయించానని చెప్పారు. తెలంగాణను కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ప్రజలు మరోమారు తనను గెలిపిస్తే జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతానని, కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని చెప్పారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ వెంకటవీరయ్య మాట్లాడుతూ అలవి గాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. ఏ హామీ సంపూర్ణంగా నెరవేర్చలేదని ఆరోపించారు. వచ్చేనెల 13వ తేదీ తర్వాత జిల్లాలో అసలైన రాజకీయం మొదలవుతుందని తెలిపారు. ఈసమావేశాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ, తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, ఎంపీపీలు ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పగుట్ల వెంకటేశ్వరరావుతో పాటు గొర్ల సంజీవరెడ్డి, దొడ్డ వెంకటకృష్ణారెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి, నూనె హరిబాబు, గొర్ల రాంమోహన్‌రెడ్డి, పాలా వెంకటరెడ్డి, గొర్ల ప్రభకర్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, జుబ్బురు నాగరాజు, నల్లమోతు ప్రసాద్, కె.సుధాకర్, గొర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్, ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సంభానీనగర్ నుంచి అల్లీపురం రోడ్డుకు ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై 27 క్వార్టర్ బాటిళ్లు, ఐదు బీర్లను తీసుకెళ్తూ తనిఖీల్లో పట్టుబడడంతో మద్యాన్ని సీజ్ చేశారు.

భార్యపై రోకలిబండతో దాడి

వివాహేతర సంబంధం.. అనుమానంతో ఘటన

మధిర(చింతకాని): వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానంతో ఓ వ్యక్తి తన భార్యపై రోకలిబండతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. చింతకాని మండలం బస్వాపురంలో ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రసపుత్ర ముత్తారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, ఆయన భార్య లలిత ప్రవర్తనపై కొన్నాళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. తరచుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తుండగా, శుక్రవారం రాత్రి కూడా గొడవ జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ముత్తారావు తన భార్యను హతమార్చాలని నిర్ణయించుకుని శనివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న ఆమె తలపై రోకలిబండతో కొట్టాడు. దీంతో లలిత ఆమె తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో ఆందోళనకు గురైన ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆతర్వాత స్థానికులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, నిందితుడు ముత్తారావు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తుండగా, వైరా సీఐ సాగర్, ఎస్సై నాగుల్‌మీరా గ్రామానికి చేరుకుని వివరాలు ఆరా తెలుసుకున్నారు. ఘటనపై బాధితురాలి అన్న నాగేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

బీఆర్.అంబేద్కర్‌కు అక్షర నివాళి



ఉపాధ్యాయుడు గీసిన అంబేద్కర్ చిత్రం

కల్లూరు: బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మైక్రో ఆర్టిస్ట్ దంతాల సుధాకర్ ప్రత్యేక ఆర్ట్(అక్షరాలతో బొమ్మలు చిత్రించడం) ద్వారా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రాన్ని రూపొందించాడు. ఎక్కడ గీతలు లేకుండా.. రాజ్యాంగంలోని ముఖ్యాంశాలను వివరించే అక్షరాలతోనే ఈ బొమ్మ చిత్రించడం విశేషం. ఈ చిత్రం ఆధారంగా ఉపాధ్యాయుడు శనివారం విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రను వివరించారు.

బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న స్కోప్ ఆర్డీ డైరెక్టర్ ప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: బాలబాలికలంతా ఆన్‌లైన్ లైంగిక దోపిడీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్కోప్ ఆర్డీ డైరెక్టర్ ఎంఎల్.ప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో సంస్థ ఆధ్వర్యాన చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో 'ఆన్‌లైన్ చిల్డ్రన్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్' అంశంపై బాలబాలికలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ బాలబాలికలు తెలిసీతెలియని వయస్సులో సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ విరివిగా వినియోగించడం వల్ల రకరకాల ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తద్వారా శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడడమే కాక.. ఏమరపాటుగా ఉంటే వేధింపులకు గురికాక తప్పదన్నారు. ఈమేరకు పిల్లలను తల్లిదండ్రులు గమనించాలని సూ చించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌బాధ్యుడు నర్సింహారావు, అఖిల్ మాట్లాడగా కోఆర్డినేటర్ సుజాత పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపాన రెండు బైక్‌లు ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కేశ్వాపురానికి చెందిన ఈదుల రవి మోటార్ సైకిల్‌పై శనివారం ఖమ్మం వెళ్తుండగా, వైరా మండలం గన్నవరానికి చెందిన కారుమంచి కృష్ణ మోటార్‌సైకిల్‌పై బాజినేని శ్రీనుతో కలిసి మరిపెడ బంగ్లా వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం వద్ద రవి వాహనాన్ని కృష్ణ కొట్టాడు. ఈ ఘటనలో రవితో పాటు శ్రీనుకి తీవ్రగాయాలు కాగా వీరిని 108లో ఖమ్మం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రోటరీ నగర్‌లో మహిళ నుంచి గొలుసు చోరీకి ఓ వ్యక్తి యత్నించాడు. రోటరీనగర్‌కు చెందిన కుమలి మంగమ్మ శనివారం సాయంత్రం బజార్ నుంచి ఇంటికి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి మంగమ్మ మెడలో గొలుసు లాగటానికి ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా అరుస్తూ పెనుగులాడటంతో ఆగంతకుడి ప్రయత్నం విఫలం కాగా పారిపోయాడు. ఘటనలో మంగమ్మ కింద పడగా గాయాలయ్యాయి. ఈమేరకు సంఘటనా స్థలానికి ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, సీఐ బాలకృష్ణ చేరుకుని ఆగంతకుడిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు పుటేజీ పరిశీలించారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు నిప్పంటించుకోవడంతో వరి గడ్డి వాము కాలిపోయింది. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన రైతు యర్రపు శ్రీనివాసరావు 450 వరిగడ్డి దిండ్లకు శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే రూ.50వేల విలువైన గడ్డి కాలిపోయింది. కాగా, గడ్డి వాము పక్కనే పెద్దిరాజు బుర్రయ్యకు చెందిన పూరిగుడిసె ఉండగా. అగ్నిమాపక శాఖ సిబ్బంది ముందస్తుగా నీళ్లు చల్ల డంతో మంటలు అంటుకోలేదు. రైతు కు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదంలో పల్లె ప్రకృతి వనాలు దగ్ధం

తల్లాడ: తల్లాడలో ఏర్పాటుచేసిన మూడు పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. తల్లాడ మేజర్ పంచాయతీ పరిధి ఎదుళ్ల చెరువు సమీపాన మూడెకరాల్లో తల్లాడ, నారాయణ పురం, మంగాపురం గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాలను మూడెకరాల్లో ఏర్పాటు చేశారు. సమీప పొలాల రైతులు శనివారం చెత్తకు నిప్పు పట్టగా మంటలు పెరిగి పల్లె ప్రకృతి వనాల్లోని చెట్లకు అంటుకుంది. దీంతో మొక్కలు పాక్షికంగా కాలిపోయాయి. గ్రామపంచాయతీ ట్యాంకర్, ఫైరింజన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

అదుపుతప్పి కారు బోల్తా

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని చెరువు కట్ట మూలమలుపు మీదుగా వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పొలాల్లో బోల్తా పడింది. ఖమ్మం నుంచి కోదాడ వైపు శనివారం కారు వెళ్తుండగా, కట్టలమ్మ చెరువు వద్ద ప్రమాదం జరిగింది. తొలుత మూలమలుపు వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన కారు పల్టీలు కొడుతూ పంటల పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. కాగా, అందులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనలో వారికి గాయాలు కాగా, ఖమ్మం వెళ్లినట్లు సమాచారం.

వారిద్దరిదీ అసూయ, ద్వేషం

షర్మిల, సునీతపై వైఎస్సార్ సోదరి విమలమ్మ

- వైఎస్సార్ శత్రువుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలయ్యారు... వైఎస్ కుటుంబ పరువును రోడ్డుకీడుస్తున్నారు
- వైఎస్ ఇంటి ఆడపడుచుల తీరు అన్యాయంగా ఉంది
- వారిద్దరూ నోరుమూసుకోవాలి.. ఇంటి ఆడపడుచుగా నేను చెబుతున్నా
- వివేకానందరెడ్డి హత్యతో అవినాశ్, భాస్కర్‌రెడ్డిలకు సంబంధంలేదు
- హత్య చేసిన దస్తగిరి మాత్రం దర్గాగా తిరుగుతున్నాడు
- అతని మాటలు విని అవినాశ్‌ను వేధిస్తారా
- షర్మిల, సునీత ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలి
- ప్రజలకు మంచిచేసే జగన్ మళ్లీ సీఎం కావాలి
- మీడియాతో వైఎస్సార్ సోదరి విమలమ్మ

సాక్షి, అమరావతి: 'వైఎస్ కుటుంబ ఆడపడుచులు షర్మిల, సునీత అన్యాయంగా మాట్లాడుతున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారు. నేనూ వైఎస్ కుటుంబ ఆడపడుచునే. వివేకానందరెడ్డి అందరికంటే నాకే ఎక్కువ సన్నిహితుడు. ఆ కుటుంబ ఆడపడుచుగా చెబుతున్నా.. మా అన్నయ్య వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో ఎంపీ అవినాశ్‌రెడ్డికిగానీ వైఎస్ భాస్కర్‌రెడ్డికిగానీ ఎలాంటి సంబంధంలేదు'.. అని వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి విమలమ్మ విస్పష్టంగా ప్రకటించారు. 'కొంగు పట్టుకుని షర్మిల ఓట్లు అడుగుతున్న వీడియో చూసి చాలా బాధపడ్డాను. వైఎస్ కుటుంబ పరువును ఆమె రోడ్డుకీడుస్తున్నారు. ఆమెలో నాయకత్వ లక్షణాల్లేవు. నిత్యం వైఎస్ అవినాశ్‌ను విమర్శి స్తున్నారు. అతను హత్య చేయడంగానీ చేయించడంగానీ వాళ్లు చూశారా? సీఎం జగన్‌పై కూడా దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరు హత్యచేశారో షర్మిల, సునీతే నిర్ణయించేస్తే ఇక కోర్టులు, జడ్జీలు ఎందుకు?' అని ఆమె సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో


వైఎస్ విమలమ్మ

శనివారం విమలమ్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై ఇలా సూటిగా స్పందించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్ శత్రువుల చేతుల్లో కీలుబొమ్మలుగా షర్మిల, సునీత..

వైఎస్ రాజశేఖరరెడ్డి శత్రువులంతా ఒక్కటయ్యారు. ఈ తరుణంలో వైఎస్ కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండాలి. కానీ, వైఎస్ శత్రువుల చేతుల్లో షర్మిల, సునీత కీలుబొమ్మలయ్యారు. వాళ్లిద్దరి చుట్టూ ప్రస్తుతం వైఎస్ కుటుంబ శత్రువులే ఉన్నారు. షర్మిల, సునీతలకు చెబుతున్నా.. వారు నోరు మూసుకోవాలి. పేద ప్రజలకు మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూడటం సరికాదు. వారిద్దరూ ఎందుకిలా చేస్తున్నారో అర్థంకావడం లేదు. డబ్బు కోసమో పదవి కోసమో తెలీదం లేదు గానీ అసూయ, ద్వేషంతో వ్యవహరిస్తున్నారు. ఏదో ఆశించే ఇదంతా చేస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక బంధువులు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని దూరం పెట్టారు. వాళ్ల పనులు కావడంలేదనే ఇలా ప్రవర్తిస్తున్నారనిపిస్తోంది. వారికి మంచి చెప్పాలని చూశాను. అప్పటి నుంచి నాతో మాట్లాడటం మానేశారు.

హంతకుడు దస్తగిరి దర్గాగా తిరుగుతున్నాడు..

షర్మిల, సునీత తామేది మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారు. మా ఇంట్లో అమ్మాయిలు ఇలా అన్యాయంగా మాట్లాడుతుంటే బాధ కలుగుతోంది. వివేకానందరెడ్డిని కిరాతకంగా హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి మాత్రం బయట దర్గాగా తిరుగుతున్నాడు. అతని మాటలు నమ్మి అవినాష్‌రెడ్డిని విమర్శిస్తారా? ఏ తప్పూ చేయని వైఎస్ భాస్కర్‌రెడ్డి ఏడాదిగా జైల్లో ఉన్నారు. అవినాశ్ బెయిల్ రద్దుచేయాలని షర్మిల, సునీత కోర్టులో కేసులు వేశారు. కానీ, వివేకాను హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి బెయిల్‌పై ఉన్నా వారెందుకు పట్టించుకోవడంలేదు? షర్మిల, సునీత ఎన్ని మాటలంటున్నా అవినాశ్ ఒక్క మాటా కూడా అనడంలేదు.

వైఎస్‌కు వివేక ఎలాగో.. జగన్‌కు అవినాశ్ అలా..

వైఎస్ రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. రాజశేఖరరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసేవారు. అందుకే పులివెందుల, కడప జిల్లాలో పార్టీ బాధ్యతలను వివేకాకు అప్పగించారు. వారిద్దరిలో ఒకరు ఎంపీగా పోటీచేస్తే మరొకరు ఎమ్మెల్యేగా పోటీచేసేవారు. అలా ఓటమి అన్నది లేకుండా గెలుస్తూ వచ్చారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డికి వివేకానందరెడ్డి ఎలానో ప్రస్తుతం వైఎస్ జగన్‌కు వైఎస్ అవినాశ్ అలా అండగా ఉన్నారు. కానీ, వైఎస్ హఠాన్మరణం తర్వాత మారిన పరిస్థితుల్లో వైఎస్ జగన్ తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టారు. దురదృష్టవశాత్తూ ఆనాడు వివేకానందరెడ్డి కాంగ్రెస్ వైపు ఉండిపోయారు. ఆ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా జగన్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసుకోవాల్సి వచ్చింది. అందుకే పులివెందుల, కడప జిల్లాల్లో పార్టీ బాధ్యతలను చూసుకునేందుకు అవినాశ్‌రెడ్డిని ఎంపిక చేసుకున్నారు. దీంతో అవినాశ్ తనపై పెట్టిన బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారు. పులివెందులను, కడప జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు. అసలు అవినాశ్‌ను ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు కదా. ఈ విషయాన్ని గుర్తించయినా షర్మిల, సునీత అవినాశ్ మీద దుష్ప్రచారాన్ని మానుకోవాలి. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌కు అండగా నిలవాలి. వారిద్దరూ మరోసారి కూర్చుని చర్చించి జగన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. ఎందుకంటే జగన్ శత్రువులంతా ఒక్కటయ్యారు. బయట శత్రువులంతా ఒక్కటైతే కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండి ఎదుర్కోవాలి. ఆ కుటుంబ ధర్మాన్ని పాటించాలని షర్మిల, సునీతలకు సూచిస్తున్నా.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయండి..

ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది ప్రజల గుండెల్లో దేవుడిగా ఉన్నారు. వైఎస్, వివేకా ఇద్దరూ ఫ్యాక్షన్ రాజకీయాలకు వ్యతిరేకం. మా నాన్నను హత్యచేసిన తరువాత కూడా ఎలాంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడకుండా వారు ఫ్యాక్షన్‌ను అంతంచేశారు. కానీ, ప్రశాంతంగా ఉన్న పులివెందులలో ప్రస్తుతం కొందరు అల్లర్లు రేకెత్తించేందుకు యత్నిస్తుండటం బాధ కలిగిస్తోంది. తండ్రి రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకు జగన్ ప్రజలకు ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. పేద ప్రజలకు అంత మంచి చేస్తున్న జగన్ మరోసారి సీఎం కావాలి. అందుకోసం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అందరినీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

రైతన్నకు అకాల నష్టం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షానికి తడిసిన ధాన్యం

నిజామాబాద్/కామారెడ్డి నెట్‌వర్క్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు కురిసిన అకాల వర్షానికి కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వర్షపు నీటి ప్రవాహంలో వడ్లు కొట్టుకుపోయాయి. చేతికందిన పంటను అమ్ముకునే సమయంలో వర్షం దెబ్బతీయడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఆర్మూరు, ఆలూర్, ఎడపల్లి, వర్ని, చందూర్, మోస్రా, సాలూర, రుద్రూర్, కోటగిరి, పొతంగల్, రెంజల్, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల్లో రైతుల కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద, లింగంపేట, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో రోడ్లపై ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ధాన్యం రాశుల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో పోలీసుస్టేషన్ సమీపంలో రోడ్లపై ఉన్న ధాన్యం రాశుల మధ్య నీరు భారీగా చేరడంతో మోటార్ల సహాయంతో తొలగించారు. వర్షాలతో అంతటా వరి కోతలకు బ్రేక్ పడింది.

కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు

- ఇప్పటివరకు 1.87 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం..
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి


డీఎస్ చౌహాన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదని.. కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల 25 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని.. ఇప్పటివరకు 7,149 కేంద్రాల్లో కలిపి 1.87 లక్షల టన్నులు కొన్నా మని వివరించారు. అత్యధికంగా నిజామాబాద్‌లో లక్ష టన్నులు, కామారెడ్డిలో 11 వేల టన్నుల కొనుగోళ్లు జరిగాయన్నారు. రూ.2,350 నుంచి రూ.2,900 ధరతో ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని.. మద్దతు ధర కంటే ఎక్కువ ధర రైతుల కు అందుతోందని పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. మార్కెట్ యార్డులలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు టార్గెట్ పెట్టుకున్నామని చెప్పారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాత విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని చెప్పారు.

బకాయిల వసూలుపై ఫోకస్

రైస్ మిల్లర్ల నుంచి బకాయిల వసూలు మొదలు పెట్టామని.. దీంతో కొందరు మిల్లర్లు భయపడి ఇతర దేశాలకు పారిపోయారని డీఎస్ చౌహాన్ చెప్పారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రవాణా బకాయిలు రూ.900 కోట్లను క్లియర్ చేశామన్నారు.

వ్యవసాయ మార్కెట్లలో రైతుల పడిగాపులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పోటెత్తిన ధాన్యం
- కొనుగోళ్ల జాప్యంతో అన్నదాతలకు ఇబ్బందులు
- కేసుల నేపథ్యంలో జనగామ మార్కెట్లో కొనుగోళ్లు నిలిపేసిన వ్యాపారులు
- మద్దతు ధరకు కొనుగోలు చేయలేమని స్పష్టీకరణ
- పంటలు తెచ్చిన రైతుల్లో ఆందోళన


తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి)/జనగామ: వానల్లేక, సాగునీరు అందక చాలా చోట్ల వరి పంట దెబ్బతిన్నది. మిగిలిన చోట రైతులు వరికోతలు పూర్తి చేసి.. వ్యవసాయ మార్కెట్లకు తెస్తున్నారు. కానీ మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు చేస్తుండటం, అదీ సరిగా సాగకపోవడంతో.. పడిగాపులు పడుతున్నారు. శనివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

భారీగా పోటెత్తిన ధాన్యం

శనివారం తిరుమ లగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 47,660 బస్తాల ధాన్యం వచ్చింది. యాసంగి సీజన్ మొదలై నప్పటి నుంచి ఇంత భారీగా ధాన్యం రావడం ఇదే మొదటిసారి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. వాతావరణంలో మార్పులతో రైతులు యార్డుకే ధాన్యాన్ని తీసుకొస్తున్నారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే మార్కెట్‌లోకి ధాన్యం ట్రాక్టర్లను అనుమతించాల్సి ఉండగా.. శనివారం తెల్లవారు జాము వరకు పంపలేదు. దీనితో రోడ్డు పైనే వందలకొద్దీ ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కాగా ట్రేడర్లు ధాన్యానికి క్వింటాల్‌కు కనిష్టంగా రూ.1,700, గరిష్టంగా రూ.1,980 ధర చెల్లించారు.

జనగామలో కొనుగోళ్లు నిలిపేసిన ట్రేడర్లు

తక్కువ ధరకు ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన, ముగ్గురు ట్రేడర్లపై కేసుల నమోదు నేపథ్యంలో.. జనగామ వ్యవసాయ మార్కెట్లో ట్రేడర్లు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనితో మార్కెట్‌కు వరి ధాన్యం, మక్కలు, చింతపండు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చిన రైతులు వాటిని అమ్ముకో వడానికి పడిగాపులు పడుతున్నారు. ఇక మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ శనివారం జనగామ మార్కెట్ కార్యాలయంలో.. ట్రేడర్లు, అడ్తిదారులతో రెండు గంటల పాటు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ప్రైవేట్ మార్కెట్‌లోనూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని రాజునాయక్ కోరగా.. అది సాధ్యం కాదని ట్రేడర్లు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లేని నిబంధనలను జనగామ మార్కెట్‌పై ఎందుకు రుద్దుతున్నారని ప్రశ్నించారు. తమపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. మరోవైపు ఈ మార్కెట్లో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని రైతులు ఎదురు చూస్తున్నారు.

గురుకులంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థత

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని శనివారం 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఆరో తరగతి చదువుతున్న సీహెచ్.ప్రశాంత్, కల్యాణ్ కృష్ణ అనే ఇద్దరు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌కు తరలించారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఎనిమిది మందికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మిగతా 15 మంది విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

జిల్లా వార్తలు

రాములోరి కల్యాణానికి ముస్తాబు


నేలకొండపల్లి రామదాసు మందిరంలోని ఉత్సవ మూర్తులు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు కంచర్ల గోపన్న(భక్త రామదాసు) జన్మస్థలమైన నేలకొండపల్లిలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకోగా.. శనివారం అధికారులు మందిరం అర్చకుడు సౌమిత్రి రమేష్‌కు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. అలాగే, కల్యాణోత్సవం నిర్వహణకు రూ.50వేల వరకు నిధులు కేటాయించినట్లు తెలిసింది. ఇక కల్యాణం నిర్వహించేందుకు భద్రాచలం దేవస్థానం నుంచి నలుగురు వేద పండితులు రానుండగా, స్థానిక భక్తులు గోటి తలంబ్రాలను ఇప్పటికే సిద్ధం చేశారు.

రేపటి నుంచి ఫ్యాక్టరీలో క్రషింగ్

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో సోమవారం నుండి గెలల క్రషింగ్ పునఃప్రారంభం కానుంది. ఈ విషయన్ని ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మత్తుల కారణంగా నెల క్రితం అప్పారావుపేట ఫ్యాక్టరీకి సెలవు ప్రకటించారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో ఈనెల 15వ తేదీ నుంచి గెలలు స్వీకరిస్తామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

అశ్వారావుపేట ఫ్యాక్టరీలో బ్రేక్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని అయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఈనెల 15వ తేదీ నుంచి గెలల క్రషింగ్ నిలిపేస్తున్నట్లు ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఫ్యాక్టరీ నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకి గెలలను తరలించాలని కోరారు. కాగా, గెలల దిగుబడి సమయాన నిర్వహణ పనుల పేరుతో క్రషింగ్ నిలిపివేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆట మొదలు కాలేదు...!

- క్రీడాకారులకు అందని క్రీడా కిట్లు
- గ్రామపంచాయతీలకే పరిమితం
- ఉమ్మడి జిల్లాకు 1,336 కిట్ల కేటాయింపు
- ఇప్పుడైనా వినియోగంలోకి తీసుకురావాలంటున్న యువత


వెంకటేశ్వర కాలనీలో క్రీడాప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు (ఇన్‌సెట్) గౌతంపూర్‌లో అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణం

చుంచుపల్లి: క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించినా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. సరైన వసతులు కల్పించకపోవడంతో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన క్రీడా సామగ్రి గ్రామపంచాయతీ కార్యాలయాలకే పరిమితం కావడంతో యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

మున్సిపాలిటీలు, గ్రామాల్లో..

గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 2022వ సంవత్సరం జూన్ 2న ప్రతీ గ్రామం, పట్టణాల్లో అనువైన స్థలాలు గుర్తించగా.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్థల లభ్యత, జనాభా ఆధారంగా రెండు నుంచి మూడు ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ ఆడేలా కోర్టును సిద్ధం యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి రాలేదు. ఇక ఆరు నెలల క్రితం క్రీడా సామగ్రిని తెలంగాణ క్రీడాశాఖ ద్వారా పంపిణీ చేసింది. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కిప్పింగ్‌తో పాటు పలురకాల పరికరాలను సమకూర్చగా..వీటిని కార్యాలయాలకే పరిమితం చేశారు. ఒక్కొక్కటి రూ.63వేల విలువైన కిట్లను ఖమ్మం జిల్లాకు 606, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 730 సమకూర్చారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీలకు సరఫరా చేయగా అక్కడి నుంచి అధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. కానీ గ్రామపంచాయతీ కార్యాలయాలు దాటి క్రీడాప్రాంగణాలకు ఇవి చేరలేదు. ఒక్కో కిట్‌లో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ సామగ్రి ఉంది. క్రికెట్ బ్యాట్లు, గ్లౌజ్‌లు, లెగ్ ప్యాడ్లు, వికెట్లు, బంతులు, వాలీబాల్‌కు సంబంధించి సింథటిక్ బాల్స్, సైకిల్ పంపు, జిమ్ పరికరాల్లో డంబెల్స్, మెసరింగ్ టేప్, డిస్కస్ త్రో, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ తాళ్లు, విజిల్స్, స్టాప్‌వాచ్‌తో పాటు క్రీడాకారులకు టీషర్టులు ఉన్నాయి. అయితే, ఈ కిట్లు ప్రాంగణాలకు చేరక జీపీ కార్యాలయాల్లో పడి ఉండగా.. వేసవి సెలవుల్లో శిక్షణ పొందుతామని భావించిన వారికి నిరాశే ఎదురవుతోంది.


జీపీల బాధ్యులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

అస్తవ్యస్తంగా ప్రాంగణాలు

గ్రామాల పరిధిలో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆటలు ఆడేలా చదును చేయించడంతో పాటు వాలీబాల్, ఖోఖో కోర్టులు సిద్ధం చేసి సింగిల్, డబుల్‌బార్ కూడా ఏర్పాటుచేశారు. ఉన్నా కానీ చాలా గ్రామాల్లో స్థలాల కొరతతో ఊరికి దూరంగా, శ్మశానవాటికల పక్కన, పాఠశాలల ప్రాంగణాల్లో ఏర్పాటుచేయడంతో ఉపయోగంలోకి రావడం లేదు.ఇక పట్టణాల్లోనూ వార్డుకో క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేయాల్సి ఉన్నా స్థలకొరతతో నాలుగైదు వార్డులకు కలిపి ఒకటి ఏర్పాటు చేశారు. ఆతర్వాత సరైన వసతులు కల్పించక.. శిక్షణ ఇచ్చే వారు లేక యువకులు, క్రీడాకారులు రావడానికి ఆసక్తి చూపడం లేదు. అనంతరం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో చాలాచోట్ల క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి.


వినియోగంలోకి తీసుకురావాలి..



గత ప్రభుత్వం హడావుడిగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ వసతులు లేక ఆదరణకు నోచుకోవడం లేదు. పంచాయతీ బాధ్యులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఇకనైనా క్రీడాకారులకు కిట్లు అందించి ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి.

– భూక్యా రమేష్, సీపీఎం నాయకుడు

క్రీడా ప్రాంగణాల నిర్వహణపై దృష్టి



గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూడాల్సి ఉంటుంది. ఈ విషయమై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు ఇస్తాం. అలాగే, క్రీడా కిట్లను ఉపయోగంలోకి వినియోగంలోకి తేవాలని సూచిస్తాం.

– వి.చంద్రమౌళి, డీపీఓ, భద్రాద్రి కొత్తగూడెం

అంబేద్కర్ జయంతి వేడుకలకు రూ.12 లక్షల నిధులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఆదివా రం నిర్వహించనున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలకు యాజమాన్యం రూ.12.10 లక్షల బడ్జెట్ కేటాయించింది. ఇందులో ఎస్టీపీపీ(సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్, మంచిర్యాల)కు రూ.50 వేలు, హైదరాబాద్ కార్యాలయానికి రూ.35 వేలు, నైనీ కార్యాలయానికి రూ.25 వేలతో పాటు మిగిలిన 11 ఏరియాలకు రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేశారు. ఈమేరకు వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. ఇటీవల ఆయన వివిధ విభాగాల అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో సమావేశమై చర్చించారు.

కాగా, కొత్తగూడెంలోని సింగరేణి ప్రధా న కార్యాలయంలో ఆదివారం డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.

ఎన్డీఏను గద్దె దింపడమే ప్రధాన అజెండా

- ఓటమి భయంతోనే ఈడీ, సీబీఐ దాడులు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు


మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు, పక్కన తమ్మినేని, నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్డీఏ కూటమిని గద్దె దించడమే ప్రధాన అజెండాగా లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం, ఇండియా కూటమి ముందుకెళ్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. దేశాన్ని మోదీ ప్రభుత్వం ప్రమాదకరస్థాయికి తీసుకెళ్లిందని, అదే కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజ్య స్వభావమే పూర్తిగా మారిపోతుందని తెలిపారు. అందుకే ఎన్నికల్లో ప్రధాన భూమిక పోషించాలని మార్క్సిస్టు పార్టీ నిర్ణయించిందన్నారు. అయితే, మోదీ, కార్పొరేట్ శక్తులు దేశంలో కృత్రిమ వాతావరణాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తున్నాయని, అత్యధిక సీట్లు వస్తాయని అనుకూల కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా ప్రచారం చేయించుకోవడమే కాక ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు పెరిగాయని చెప్పిస్తున్నా ఇందులో వాస్తవం లేదన్నారు. గెలుస్తామని విశ్వాసం ఉంటే ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, హేమంత్ సోరైన్ లాంటివారిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. బీజేపీకి ప్రమాదకరంగా ఉన్న వారిపై ఈడీతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. కాగా, ఈ దేశంలో ఎన్నికల బాండ్లు తీసుకోని ఏకైక పార్టీ సీపీఎం మాత్రమేనని, నీతి, నిజాయితీ అంటూ మాట్లాడే బీజేపీ మాత్రం అత్యధికంగా బాండ్లు తీసుకుందని ఆరోపించారు. దేశంలో రాజ్యాంగ మౌలిక విలువలను రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణలోనూ బీజేపీ ప్రమాదం ముంచుకొస్తోందని, మతోన్మాద వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానం కూడా గెలవకూడదనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇక కాంగ్రెస్‌ను లౌకిక పార్టీగా అంగీకరిస్తున్నామే తప్ప ఆ పార్టీపై మోజేమీ లేదని రాఘవులు చెప్పారు. అయితే, తెలంగాణలో ఆ విజ్ఞత కాంగ్రెస్‌కు లేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వర్లు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ

నాటి ఎమర్జెన్సీని మించి నిరంకుశ విధానాలను బీజేపీ అవలంభిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందని తెలిపారు. ఈమేరకు ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని శనివారం ఆయన ఖమ్మంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం ఉపా చట్టం కింద జైలు జీవితం గడుపుతున్న ప్రబీర్... ఎంత కష్టాన్నయినా ఓ విప్లవకారుడు ఎలా ఎదుర్కొంటాడో ఈ పుస్తకం ద్వారా పరిచయం చేశారని వివరించారు. కాగా, కాంగ్రెస్, బీజేపీల అధికార మార్పిడి జరిగిందే తప్ప జైళ్లు, నిర్బంధాలు మారలేదని తెలిపారు. రచయిత ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం, సీపీఐ, ఎన్డీ నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, మందుల రాజేంద్రప్రసాద్, విద్యావేత్త రవి మారుత్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, జేఎన్‌యూ పూర్వ విద్యార్థి నెల్లూరు నరసింహారావు, విజయ్, మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

మధిర(చింతకాని): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నాగులవంచ రైల్వే కాలనీ పీఎస్ హెచ్ఎం గుండా మధుకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోగా తిరిగి వెనక్కి పంపడం సరికాదన్నారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్, సరెండర్ లీవ్, పెన్షనర్ల బిల్లులను ఇకనైనా విడుదల చేయాలని కోరారు. అలాగే, ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఎంఈఓ మోదుగు శ్యాంసన్, టీపీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు, నాయకులు జీవీబీ.రంగారెడ్డి, విజయ్, మల్లికార్జున్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, పుల్లయ్య, చెన్నకేశవరెడ్డి, జలీల్‌పాషా, శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, రత్నకుమారి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.